క్లుప్తంగా

పీఏసీఎస్ చైర్మన్ల నియామకం




మెండ సన్యాసిరావు గెల్లంకి వెంకటరావు

సారవకోట: సారవకోట, బుడితి పీఏసీఎస్‌లకు చైర్మన్ల నియామకం జరిగింది. సారవకోటకు గెల్లంకి వెంకటరావు, బుడితి చైర్మన్‌గా మెండ సన్యాసిరావు నియమితులయ్యారు. సారవకోట డైరెక్టర్లుగా కోరాడ అప్పయ్య, బొంగు కొండయ్యలు, బుడితికి బోర శ్రీరామమూర్తి, పొన్నాన హరిప్రసాద్‌లను నియమించారు.

వ్యాక్సినేషన్ తప్పనిసరి



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న లక్ష్మీతులసి

జలుమూరు: గర్భిణులు, బాలింతలు, పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు వేయించాలని ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నోడల్ అధికారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో లక్ష్మీతులసి అన్నారు. సైరిగాం పీహెచ్‌సీని శనివారం సందర్శించి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం తిమడా ఆరోగ్య ఉపకేంద్రంలో చేపట్టిన వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించారు. డిప్యూటీ పారా మెడికల్ అధికారి వాన సురేష్‌కుమార్, ఈవో బీఎం నాయుడు, ఆరోగ్య కార్యకర్త మెట్ట రంగమ్మ ఉన్నారు.

వేడుకగా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో భక్తజనం

నరసన్నపేట: స్థానిక పెద్దపేట రోడ్డులోని గీతా మందిరం పక్కన ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ 12 వార్షికోత్సవం శనివారం వేడుకగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ పూజా కార్యక్రమాలు, కల్యాణం నిర్వహించారు. 21 మంది దంపతులచే ప్రత్యేక పూజలు, 108 కలశాలతో అభిషేకాలు చేపట్టారు. ఉదయం నుంచి స్వర్ణకారులు, విశ్వ బ్రాహ్మణులు భారీగా తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

ఒడిశా మద్యంతో వ్యక్తి అరెస్ట్




పట్టుబడిన యువకుడు, స్వాధీనం చేస్తున్న మద్యం బాటిళ్లతో పోలీసు సిబ్బంది

పాతపట్నం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద ఎస్సై ఎన్.కామేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఇదే సమయంలో కోటబొమ్మాళి మండలం నారాయణవలస గ్రామానికి చెందిన యువకుడు పట్నాన తవిటి నాయుడు ఒడిశా నుంచి పది మద్యం బాటిళ్లను ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్సై తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, ద్విచక్ర వాహనం సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు మదన్, శ్యామలరావు ఉన్నారు.

మద్యంతో ఒకరు..

మెళియాపుట్టి: జాడుపల్లి గ్రామానికి చెందిన పెద్దింటి బాలకృష్ణ అక్రమంగా మద్యం తరలిస్తుండగా మెళియాపుట్టి పోలీసులకు శనివారం పట్టుబడ్డారు. మెళియాపుట్టి ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద ఐదు బాటిళ్లను కొనుగోలుచేసి.. వాటిని జాడుపల్లి గ్రామంలో అధిక ధరకు విక్రయిస్తున్నాడన్న సమాచారంతో దాడిచేసి బాలకృష్ణను పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

ఘనంగా అసిరితల్లి అమ్మవారి వార్షికోత్సవం



అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామ అసిరితల్లి అమ్మవారి వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు బంకుపల్లి గోపాలరావు ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు, అర్చనలు చేశారు. మహిళలు ఘటాలతో వెళ్లి అమ్మవారికి ముర్రాటలతో చల్లదనం చేసి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

ఇంటింటా జగన్ నినాదం



బూర్జ: ఒపివాడ వెంకంపేట గ్రామంలో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరిస్తున్న నాయకులు బుడుమూరు సూర్యారావు, ఇసాయి వెంకటరావు తదితరులు



పాతపట్నం: నీలమణిదుర్గ కాలనీలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు ఎస్.ప్రదీప్, వై.సూర్యం



నరసన్నపేట: బొరిగివలసలో సర్వే నిర్వహిస్తున్న గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు



ఆమదాలవలస రూరల్: చీమలవలసలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో మా నమ్మకం నువ్వే జగన్ స్టికర్లతో నాయకులు



కొత్తూరు: గులివిందలపేటలో కార్యక్రమం నిర్వహిస్తున్న కొత్తూరు పీఏసీఎస్ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ

సీఎం జగనే మా బలమని జనం నినదిస్తున్నారు. బతుకులకు భరోసా కల్పించిన నాయకుడికి రానున్న ఎన్నికల్లో కూడా అండగా నిలబడతామంటున్నారు. మండు వేసవిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి..చేకూరిన లబ్ధిని తెలియజేస్తున్నారు. ప్రజా సర్వేలో భాగంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ప్రజలను నేరుగా కలిసి ప్రభుత్వ పాలనపై ఆరా తీస్తుండగా.. ప్రజలు ఓపిగ్గా సమాధానాలు ఇస్తున్నారు. శనివారం పలు గ్రామాల్లో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఇంటి యజమానుల అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను గోడలపై..సెల్‌ఫోన్లపై అతికించారు.

పేదల జీవితాల్లో వెలుగులు

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- లక్కుపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

బూర్జ: పేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని చెప్పారు. పాలవలస సచివాలయం పరిధి లక్కుపురం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ నాలుగేళ్ల కాలంలో చేకూరిన లబ్ధిని తెలియజేసి..అందుకు సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. మంచి నీటి, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని, శిథిలమైన విద్యుత్ స్తంభాలను తొలగించాలని గ్రామస్తులు కోరారు. రూ.63 లక్షల జేజేఎం నిధులతో త్వరలో పనులు చేపట్టనున్నట్లు స్పీకర్ తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం జగన్‌కు అండగా నిలవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, పీఏసీఎస్ చైర్మన్ బగాది నారాయణ మూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకట్రావు, స్థానిక సర్పంచ్ వి.విజయలక్ష్మి, మండల కన్వీనర్ల కోఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, నాయకులు మామిడి శ్రీనివాసరావు, బొడ్డేపల్లి నాగరాజు, ఏగు రాజారావు, తొత్తడి సురేష్ పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న కృష్ణదాస్

జలుమూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. జోనంకి పంచాయతీ పరిధి గంగాధరపేటలో రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవనాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సచివాలయ వ్యవస్థ నుంచి సంక్షేమ పథకాల వరకూ ప్రజలకు సక్రమంగా అందజేస్తున్నామన్నారు. గత టీడీపీ పాలనకు..ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనకు తేడాను ప్రజలు గమనించాలన్నారు. టీడీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం కుంటుపడిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ సేవలు, పథకాలు ఇంటి ముందుకే వస్తున్నాయన్నారు. ఇది నిజమా కాదా అన్నది విజ్ఞతతో ఆలోచన చేయాలని కోరారు. అన్ని వర్గాల ప్రయోజనంతోపాటు రాష్ట్ర విశాల ప్రయోజనం కోసం సీఎం జగన్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు.

ఎత్తిపోతల పథకానికి అంచనాలు

సర్పంచ్ జి.వి.రమణి మాట్లాడుతూ.. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన జోనంకి పరిసర గ్రామాలకు సాగునీరు లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారని.. పరిష్కారం చేయాలని కోరారు. దీనికి కృష్ణదాస్ స్పందించి పక్కనే ఉన్న వెలమలవానిపేట ఎత్తిపోతల పథకానికి మోటారు అనుసంధానం చేసి తాత్కాలికంగా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే శాశ్వత పరిష్కారానికి ఎత్తిపోతల పథకానికి ఎంత ఖర్చు అవుతోందో అంచనాలు వేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సీఎం పేషీ నుంచి అనుమతులు తీసుకొని మంజూరునకు కృషి చేస్తామన్నారు. జోనంకి పంచాయతీలో ఇటు ప్రభుత్వ నిధులతోపాటు సర్పంచ్ జీవి రమణి, కుటుంబ సభ్యులు రూ. లక్షలు వెచ్చించి చెరువు అభివృద్ధి, రచ్చబండ నిర్మాణం, రోడ్లు ఏర్పాటు చేయడంపై కృష్ణదాస్ అభినందించారు.

మాజీ ఎంపీ మృతికి సంతాపం

తొలుత మాజీ ఎంపీ కణితి విశ్వనాథం మృతికి సంతాపం సూచికగా సభలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, తహసీల్దార్ సత్యం, ఎంపీడీఓ జి.వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం

జలుమూరు: అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నారని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. రాష్ట్రంలో పారదర్శకత పాలన సాగుతోందని చెప్పారు. జోనంకి పంచాయతీ పరిధి గంగాధరపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, ఎంపీపీ వాన గోపి, మండల పార్టీ కన్వీనర్ కనుసు సీతారాం, అల్లాడ ,చల్లవానిపేట సొసైటీ అధ్యక్షులు ఎం.శ్యామలరావు, రాజప్పల నాయుడు, మండల సలహాదారు పైడి విఠలరావు, సర్పంచ్ జీవీ రమణి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బుక్కా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే ఆయుధం



నరసన్నపేట: మంటలను అదుపు చేసే విధానాన్ని వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



కొత్తూరు: మంటలను అదుపు చేసే విధానాన్ని వివరిస్తున్న సిబ్బంది

నరసన్నపేట: వేసవిలో అగ్ని ప్రమాదాలు అధికంగా సంభవించే ప్రమాదం ఉన్నందున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక అగ్నిమాపక కేంద్రం అధికారి గొర్లె రమణమూర్తి అన్నారు. అప్రమత్తతనే ఆయుధలన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నరసన్నపేటలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సిబ్బందితో అగ్ని ప్రమాదాల నివారణపై శనివారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే అగ్నిమాపక కేంద్రానికి తక్షణమే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బూరలి శంకర్ పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక కేంద్రం అధికారి జి.రమణమూర్తి అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. బహుళ అంతస్తులు, కర్మాగారాలు, పాఠశాలల్లో ప్రమాదాలు సంభవిస్తే మంటలను అదుపు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. విశ్రాంతి సివిల్ అసిస్టెంట్ సర్జన్ పాలవలస శశిభూషణరావు పాల్గొన్నారు.

మానవహక్కుల సంఘం ఉపాధ్యక్షుడుగా రమేష్‌నాయుడు



పాతపట్నం: జాతీయ మానవ హక్కుల సంఘం అవినీతి నిరోధక శాఖ విద్య విభాగానికి ఉపాధ్యక్షుడుగా పాతపట్నం పెద్దింటివీధికి చెందిన ఉపాధ్యాయుడు కనుగుల రమేష్ నాయుడు నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఆయన శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా తనవంతు కృషి చేస్తానన్నారు.

బోరుబద్రలో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రాంభిస్తున్న సర్పంచ్ శ్రీదేవి

పాతపట్నం: బోరుబద్ర గ్రామంలోని ఎంపీపీ పాఠశాల వద్ద రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 250 మందికి వైద్యులు చిన్నంనాయుడు, బోడ మోహన్‌బాబు వైద్య సేవలు అందించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని సర్పంచ్ సవిరిగాన శ్రీదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.శ్రీనివాసరావు, చిరంజీవి, అనిల్, రామారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి సమస్య లేకుండా చర్యలు



నదిలో అడ్డుకట్ట పనులు పరిశీలిస్తున్న ఈవో కుర్మారావు

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ ప్రజలకు మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఈవో కె.కూర్మారావు తెలిపారు. ఇందులో భాగంగా పంపుషెడ్డు వద్ద నీరు నిల్వ ఉంచేందుకు మహేంద్ర తనయా నదిలో అడ్డంగా గట్టు వేస్తున్నామన్నారు. వేసవి నేపథ్యంలో రక్షిత మంచినీటి పథకం ద్వారా పాతపట్నం ప్రజలకు మంచినీటికి ఇబ్బందుల్లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శిర్ల జోగారావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల కేరింతలు..



నరసన్నపేట: ఉర్లాం కేంద్రం నుంచి ఉల్లాసంగా ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

నరసన్నపేట: పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఈ నెల నాలుగో తేదీన పరీక్షలు ఆరంభమయ్యాయి. చివరి రోజున సోషల్ పరీక్ష రాసిన విద్యార్థులంతా పరీక్ష కేంద్రాల నుంచి కేరింతలు కొడుతూ.. బయటకు వస్తూ ఉత్సాహంగా కనిపించారు. మండలంలోని ఐదు కేంద్రాల్లో 1218 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

పొందూరు: తాడివలస, కింతలి, పొందూరు, మోడల్ స్కూల్ కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. చివరి రోజు పరీక్ష రాసిన తరువాత పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షల రాసేందుకు కోచింగ్ ఎక్కడ ఇస్తున్నారో విద్యార్థులు ఆరా తీశారు.

భూసార పరీక్షలపై శిక్షణ



భూసార పరీక్షల శిక్షణలో పాల్గొన్న వీఏఏలు

బూర్జ: భూసార పరీక్షలపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్టు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి.రాజగోపాలరావు చెప్పారు. తోడవాడ రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖాధికారి వి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు మండలస్థాయి భూసార పరీక్షలపై శనివారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మట్టి నమూనా సేకరణ పద్ధతులు, నేల రకాల స్వభావం, సూక్ష్మదాతులోపాలపై సంపూర్ణ శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం నిధి దుర్గారావుకు చెందిన వ్యవసాయ పొలంలో మట్టి నమూనా సేకరణ విధానాన్ని క్షేత్ర స్థాయిలో చేసిచూపించారు. మండలంలోని అన్ని ఆర్‌బీకేల పరిధిలో సుమారు వెయ్యి మట్టి నమూనాలు సేకరించి ఆమదాలవలసలోని లేబొరేటరీకి పంపించనున్నట్టు అధికారులు తెలిపారు. ఫలితాల ఆధారంగా ఎలాంటి ఎరువులు వాడాలి, ఏ పంటలను సాగు చేయాలో రైతులకు సిఫార్సు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ల కోఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు పాల్గొన్నారు.

మోదీని గద్దెదించాలి



మాట్లాడుతున్న నర్సింహులు

నరసన్నపేట: దేశ సంపదను కారు చౌకగా అదానికి దోచిపెడుతూ ప్రజా కంటకంగా మారిన కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దే దించేందుకు ప్రతిఒక్కరూ కలసి రావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సనపల నరసింహులు అన్నారు. స్థానిక ఆదివరపుపేటలో మోదీ ప్రజావ్యతి రేక విధానాలకు నిరసనగా శనివారం ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలేవీ అమలు చేయలేదన్నారు. పారిశ్రామికవేత్తలకు కొమ్ము కాస్తూ కార్మికులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో బడుగు, బలహీన వర్గాలకు ఒరిగేదేమీ లేదన్నారు. సీపీఐ నాయకులు ఎల్.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, ఎస్.కృష్ణమూర్తి, నారాయణరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



కారు పత్రాలు పరిశీలిస్తున్న పోలీసులు

కొత్తూరు: కొత్తూరు నాలుగు రోడ్ల కూడలిలో ఏఎస్సై శివాజీరెడ్డి తన సిబ్బందితో కలిసి వాహనాలను శనివారం ముమ్మరంగా తనిఖీ చేశారు. ప్రధానంగా ఒడిశా నుంచి వస్తున్న వాహనాలను నిశితంగా పరిశీలించారు. అపరిచిత వ్యక్తుల వివరాలు నమోదు చేసుకున్నారు. ఇంతవరకు వాహనాలపై ఉన్న అపరాధ రుసుం వసూళ్లు చేశారు. రోడ్డు నిబంధనలు పాటించని వాహనదారులపై 25 కేసులు నమోదు చేసి రూ. 10,150 అపరాధ రుసుం ఆన్‌లైన్లో చెల్లింపులు చేయించారు.

చెరువు అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మురళీకృష్ణ

మెళియాపుట్టి: అమృత్ సరోవర్ కార్యక్రమంలో చెరువులను అభివృద్ధి చేసుకోవడానికి ప్రజలందరూ సమిష్టిగా కృషి చేయాలని ఉపాధి హామీ పథకం టెక్కలి ఏపీడీ మురళీకృష్ణ అన్నారు. పెద్దలక్ష్మీపురం గ్రామంలో అమృత్ సరోవర్‌లో భాగంగా అభివృద్ధి చేస్తున్న చెరువు పనులను శనివారం పరిశీంచారు. నిబంధనల మేరకు పనులు చేయాలని వేతనదారులకు సూచించారు. చెరువుల అభివృద్ధి ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. గ్రామసర్పంచ్ బైపోతు ఉదయ్‌కుమార్, ఏపీవో రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, క్షేత్రసహాయకుడు జానకీరావు ఉన్నారు.

కబడ్డీ టోర్నీ విజేత 'వంశధార'



విన్నర్ జట్టుకు ట్రోఫీ, సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ లత తదితరులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంటులో చల్లపేటకు చెందిన వంశధార డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలవగా.. రన్నర్ జట్టుగా నరసన్నపేట ఎంఎల్ఆర్ నాయుడు కళాశాల జట్లు నిలిచాయి. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి నింపేందుకు వీలుగా జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 12 డిగ్రీ కళాశాలల నుంచి జట్లు పాల్గొనగా నాకౌట్ పద్ధతిలో పోటీలు జరిగాయి. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ పి.లత ట్రోఫీ, సర్టిఫికెట్లను అందజేశారు. ఉదయం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, సర్పంచ్ బూరల్లి శంకర్, డిగ్రీ కళాశాల అధ్యాపకులు రవికుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

కణితి మృతికి సంతాపం

ఆమదాలవలస: మాజీ ఎంపీ కణితి విశ్వనాథం మృతిపై డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి శనివారం సంతాపం తెలియజేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మూతబడిన ఆమదాలవలసలోని చక్కెర కర్మాగారాన్ని తెరిపించేందుకు విశ్వనాథం ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. కణితి మృతికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కన్వీనర్ సనపల అన్నాజీరావు, బీజేపీ మండల కన్వీనర్ పి.సూరపునాయుడు తదితరులు కూడా సంతాపాన్ని తెలియజేశారు.

కొత్తూరులో పారిశుద్ధ్య పనులు

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరులో జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ పడాల కృష్ణవేణి పర్యవేక్షణలో కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించి ప్రత్యేక వాహనం ద్వారా డప్పింగ్ యార్డుకు తరలించారు. వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ రవిచంద్ర

పాతపట్నం: పెద్దసీది గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ బోని పార్వతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ కె.రవిచంద్ర శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు దాహార్తితో ఇబ్బంది పడకుండా చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బోని గిరి, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, సెక్రటరీ జ్ఞానేశ్వరీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

32 మందికి నేత్ర పరీక్షలు

హిరమండలం: గొట్ట గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో అమ్మన్న చారిటబుల్ ట్రస్టు, రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. డాక్టర్ అపర్ణ 32 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. 12 మందిని శస్త్ర చికిత్సలకు పంపించామని ట్రస్ట్ అధ్యక్షుడు తంగి రమేష్ తెలిపారు. సర్పంచ్ వంజరాపు ఆరుద్ర పాల్గొన్నారు.

వేతనదారులకు ఓఆర్ఎస్ పంపిణీ



వేతనదారులకు ఓఆర్ఎస్ పంపిణీ చేస్తున్న సిబ్బంది

మెళియాపుట్టి: వేసవి తీవ్రత దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్యశాఖ సిబ్బంది ఉపాధి వేతనదారులకు సూచించారు. మండలకేంద్రం మెళియాపుట్టిలో పనులు చేస్తున్న వేతనదారులకు వేసవి జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు. అనంతరం 150 మందికి ఓఆర్ఎస్ ప్యాకెటన్లు పంపిణీ చేశారు. ఆశ కార్యకర్తలు స్వర్ణలత పట్నాయక్, సుజాత, లక్ష్మి, మేట్లు సుమ, మేఘనాథం, మేనక, యోగి ఉన్నారు.

కొబ్బరి మొక్కల కాల్చివేతపై ఫిర్యాదు

సరుబుజ్జిలి: తనకు చెందిన 20 కొబ్బరి మొక్కలపై గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి పెట్రోలు పోసి నిప్పు పెట్టారని కొండవలస గ్రామానికి చెందిన లావేటి మురళి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సరుబుజ్జిలి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయడంతో ఎస్సై కృష్ణప్రసాదు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఒకపూట పనులకు అనుమతివ్వాలని వినతి

కొత్తూరు: ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధి హామీ పథకం పనులను ఉదయం పూట మాత్రమే వేతనదారులు చేసేలా చూడాలని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు అంపిలి ప్రశాంత్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఎంపీడీవో పావనికి శనివారం వినతి పత్రం అందజేశారు. గూనభద్ర గ్రామ పంచాయతీ పరిధిలోని వేతనదారులు సుమారు మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న కంఠమానుగూడ గిరిజన గ్రామం కొండ దిగువ భాగన పనులకు రెండు పూటలు కాలినడకన వెళ్లి వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు.